ప్రజాశక్తి
మంగళవారం 27 ఫిబ్రవరి 2024 5
శ్రీ సత్యసాయి

మతతత్వ బిజెపిని గద్దె దించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



ప్రజల మధ్య మతచిచ్చురాజేసి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్న బిజెపి వచ్చే ఎన్నికల్లో గద్దెదించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్‌ను అటో..ఇటో తేల్చబోయే ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో మతత్వ బిజెపిని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇండియా వేదిక బిజెపికి సమాధి కట్టడానికి సిద్ధమైందన్నారు. విభజన హామీలను అమలు చేయని బిజెపి, దానికి మద్దతుగా నిలిచిన వైసిపి, టిడిపి, జనసేనలను ఇంటికి పంపాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు.

దేశం,రాష్ట్రంలో నియంత పాలన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

దేశం, రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. అక్కడా...ఇక్కడా రెండు ప్రభుత్వాలు కూడా పోలసులను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. 10 ఏళ్ల మోదీ పాలనలో చెప్పుకోవడానికే ఏమీ లేదన్నారు. మతతత్వం, దేవాలయ రాజకీయాలే ఉన్నాయన్నారు. రైతులు ఢిల్లీలో పోరాటానికి వెళ్తుంట రోడ్లలో మేకులు గుచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. అభివృద్ధిని విస్మరించి మతత్వంతో ముందుకొస్తున్న బిజెపికి, దానికి మద్దతుగా రాష్ట్రంలో నిలిచిన టిడిపి, వైసిపి, జనసేనలను ఓడించాలని పిలుపునిచ్చారు.

పేదలకు అండగా కాంగ్రెస్

ఎన్.రఘువీరారెడ్డి, సిడబ్ల్యూసి సభ్యుడు

కాంగ్రెస్ పేదల పార్టీ అని సిడబ్ల్యూసి సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. పేదలు, విద్యార్థులు, రైతులు, కార్మికులు, ప్రజలు సుభిక్ష్యంగా ఉండాలంటే కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో అనంతపురం జిల్లా నుంచే ఉపాధి హామీ పథకాన్ని నాడు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రారంభించారని గుర్తు చేశారు. ఇదే గడ్డ నుంచే పేద కుటుంబానికి రూ.5 వేల పంపిణి పథకం ప్రకటించడం చారిత్రాత్మకం అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి సంతకం ఆ పథకంపైనే ఉంటుందన్నారు.

కాంగ్రెస్‌లో జోష్

- 'అనంత' సభ విజయవంతం
- వేలాదిగా తరలొచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- ప్రతి కుటుంబానికీ నెలకు రూ.5 వేలు గ్యారెంటీ హామీ
- ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే
- హాజరైన పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ

ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్.షర్మిల



ప్రసంగిస్తున్న మల్లికార్జున ఖర్గే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని అనంతపురం జిల్లా నుంచి ప్రారంభించింది. తొలి ప్రచార సభకు ఎఐసిసి (అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులు) మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. ఇండియా వేదికలోనున్న సిపిఎం, సిపిఐ నుంచి ఆ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణలు పాల్గొన్నారు. ముఖ్యనేతలంతా ఈ సభకు వస్తుండటంతో జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలొచ్చారు. అనంతపురం నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఈ సభకు వేలాదిగా జనం రావడంతో కాంగ్రెస్ పార్టీ నేతల్లో కొత్త జోష్ కనిపించింది. అదే సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి నెలకు ఐదు వేల రూపాయలు ఇందిరమ్మ అభయం పేరుతో గ్యారెంటీ ఇస్తామని మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ఈ హామీ ప్రకటించగానే బహిరంగ సభలో ఉన్న జనం అంతా కరతాల ధ్వనులతో అభినందనలు తెలిపారు. మల్లికార్జున ఖర్గే కన్నడ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో ప్రసంగించగా, దాన్ని సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి తెలుగులోకి అనువదించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ప్రసంగిస్తున్న సమయంలో సభలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్, సిడబ్ల్యూసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు, జెడి శీలం, మాజీ పిసిసి అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్, గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు హాజరైన కాంగ్రెస్, నాయకులు

కార్పొరేట్‌కు దేశ సంపద : ఖర్గే

కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి దేశంలో ప్రజా సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. దేశంలో కాంగ్రెసు బలహీనంగా ఉందని ఆరోపించే మోడీ, తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను చూసి మోడీ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. అందుకే నిరంతరం రాహుల్, సోనియాగాంధీతో పాటు తనను విమర్శిస్తుంటారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా బిజెపి పూర్తి చేసిందాని ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తూనే నల్లధనమంతా తెచ్చి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు జమచేస్తామని హామీనిచ్చిందన్నారు. అది ఇప్పటికైనా అమలైందా అన్నారు. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు వంగివంగి దండాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడ బిజెపి అంటే బాబు, జగన్, పవన్‌కళ్యాణ్ అన్న చందంగా మారిందన్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. పేద ప్రజలకు అండ కాంగ్రెస్ పార్టీన అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెసు, వామపక్షాలను గెలపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బిజెపిని ప్రశ్నించలేని వైసిపి, టిడిపి

ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

కేంద్రంలోని బిజెపి 2104లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకున్నా ప్రశ్నించలేని స్థితిలో రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు వైసిపి, టిడిపి ఉన్నాయని ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల విమర్శించారు. ప్రత్యేక హోదా రాలేదు... రైతులకు మద్దతు ధరను ఇవ్వలేదన్నారు. టిడిపి, వైసిపి పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో కేంద్రంపై పోరాటం చేసి ఉంటే సాధించుకునే అవకాశం ఉండేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు మూడు వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తానని, ప్రకృతి వైపరిత్యాల సమయంలో పంటనష్టపోతే రైతులను ఆదుకునేందుకు నాలుగు వేల కోట్లతో మరో నిధిని ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు హామీనిచ్చారని గుర్తు చేశారు. ఈ ఐదేళ్లలో ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రానికి అన్యాయం చేసే పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు.

ఇళ్ల పట్టాల కోసం కదంతొక్కిన పేదలు

◆ చిలమత్తూరులో భారీ ర్యాలీ ◆ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న పేదలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఇళ్ల స్థలాల కోసం చిలమత్తూరులో పేదలు కదం తొక్కారు. హైకోర్టు తీర్పు మేరకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. చిలమత్తూరు దిగువ బస్టాండ్‌లో ర్యాలీ ప్రారంభం అయ్యింది. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగించారు. అక్కడ బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్.వెంకటేష్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పేదలు గత 7 నెలలుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. పేదలు కోడూరు రెవెన్యూ పొలం 805-6, 805-7 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో భూస్వాధీన ఉద్యమం నిర్వహించి గుడిసెలు వేసుకుని అక్కడే నివాసం ఉన్నారన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిన అధికారులు బలవంగా జెసిబిలతో వాటిని తొలగించారన్నారు. పేదల పక్షాన పోరాటం సాగిస్తున్న సిపిఎం నాయకుడు ప్రవీణ్‌కుమార్‌పై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. పదలకు పట్టాలు ఇవ్వమంటే ఇలా అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు. ఇళ్ల పట్టాలపై న్యాయం పోరాటం చేయగా, హైకోర్టు పదల పక్షాన తీర్పు ఇచ్చిందన్నారు. హైకోర్టు స్పష్టంగా 8 వారాల లోపు పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పు ఇచ్చి ఆరు వారాలు అవుతున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. హైకోర్టు తీర్పు మేరకు పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ భాగ్యలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సమస్యను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతపురం సిపిఎం నాయకులు ఎంపిడిఒ, పోలీసు, విద్యుత్ శాఖ అధికారులకూ వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వెంకటేష్, లక్ష్మీనారాయణ, రామచంద్ర, రాయల్ చందు, సదాశివరెడ్డి, రహంతుల్లా, అబ్బాస్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

'మెడికల్ అసోసియేషన్' ఎంపిక

ఎంపికైన మెడికల్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం పట్టణంలోని ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా శ్రీకాకుళం, చిత్తూరుకు చెందిన అసోసియేషన్ నాయకులు మణిరాజు, నరేష్‌బాబు, మురళీకృష్ణ వ్యవహరించారు. కరుణకుమార్ గుప్తా, కృష్ణమూర్తి, రమేష్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా శివకుమార్, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా అనిల్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని మెడికల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

అరుణాచలంలో 'పురం' కళాకారుల నృత్య ప్రదర్శన

హిందూపురం : తమిళనాడులోని అరుణాచల క్షేత్రంలో గతిస్వం-కళా క్షేత్రం బృందం సోమవారం కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. భారత్ ఆర్ట్స్ హైదరాబాద్ వారు నిర్వహించిన కార్యక్రమంలో పురం కళాకారిణులు గురు విద్యాధరి, శ్రేయ, శ్రీకృతి, స్కంధ, ప్రవల్లిక, రేఖ, మధురిమ, శర్వాణి పాల్గొన్నారు. నిర్వాహకులు కళాకారిణులకు ఆది యోగి అవార్డ్స్ ప్రదానం చేశారు.

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నిబంధనలు బేఖాతరు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

నిబంధనల మేరకు ఫర్టిలైజర్స్ దుకాణాలకు వారికి వచ్చిన సరుకు, నిల్వ, ఏ మందు ఎంత ధర, తదితర వివరాలను నిర్వాహకులు షాపు ముందు ఓ బోర్డులో ప్రదర్శించాలి. ప్రధానంగా ఫర్టిలైజర్స్ షాపు నిర్వహించేందుకు సర్టిఫికెట్ ఉండాలి. రైతులు మందులు కొనుగోలు చేసిన తర్వాత రశీదు ఇవ్వాలి. కానీ నంబులపూలకుంటలో ఉన్న ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అవేవీ పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ధరల పట్టిక లేకపోవడంతో షాపు యజమాని ఎంత ధర చెబితే రైతులు అంతే చెల్లిస్తున్నారు. దానికి సంబంధించి రశీదు కూడా ఇవ్వడంలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రతి ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు చేపట్టాలని మండల రైతు ప్రజలు కోరుతున్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వివిధ సమస్యలపై స్పందన గ్రీవెన్స్‌లో ప్రజలు అందించే అర్జీల పరిష్కారంపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 214 వినతులను డిఆర్ఒ కొండయ్య, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డిపిఒ విజయ్ కుమార్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈనెల 29 లోపు ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను ఆయా మండలాల ప్రత్యేక అధికారులు స్థానిక ఎమ్మెల్యేల అనుమతితో ప్రారంభించాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు 72, గ్రామ సచివాలయాలు 46, వైయస్సార్ హెల్త్ క్లీనిక్‌లు మొత్తం 188 ఉన్నాయని వాటిని ప్రారంభించే కార్యక్రమాలు సంబంధిత అధికారులు చేపట్టాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన క్లైములన్ను మంగళవారం సాయంత్రంలోపు పరిష్కరించాలన్నారు. ఉపాధి పనులపై ఏరోజుకారోజు ఎంపిడిఒలు నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

హిందూపురం పట్టణంలోని వాల్మీకి భవనంలో సోమవారం కరాటే సంస్థ కార్యనిర్వాహకుడు మాస్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రెండవ ఇంటర్ స్కూల్ ఓపెన్ ఛాంపియన్‌షిప్-2024 కరాటే పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటారు. మాస్టర్ షాకీర్ వద్ద శిక్షణ పొందుతున్న 40 మంది విద్యార్థులు కట విభాగంలో పాల్గొని 15 బంగారు, 18 సిల్వర్, 7 కాంస్య పతకాలు సాధించారు. వారిలో మహమ్మద్ కైఫ్, రీదా ముస్కాన్, రిహన్, రబ్బన్, రోషిని, ఆశ్వాక్, గిరిచరణ్, జోయ ఫాతిమా, నూరా నాయక్, భవిత్ రాయల్, ఫైజాన్, నవాజ్, ఐక్రియా, అవంతిక, నేహా, పూజ, తన్విక, జశ్విత, చేతన్, యజ్ఞేష్, లిఖిత, జాహ్నవిసాయి, మోహిత్ రాంనాయక్, రోహిత్, యశ్విత రెడ్డి, నందిత, యశ్వంత్, జోషిత, అర్చన, రిజ్వానా, సుదీక్ష, భువనశ్రీ, సనాకౌసర్, ఆయేషా, యస్వంత్, పునీత్, దర్శన్, కిరణ్, వర్షిత్ ఉన్నారు. నిర్వాహకులు, జబర్దస్త్ టీం సభ్యులు మాస్టర్ షాకీర్‌కి టోర్నీ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేసి శాలువా, మెమొంటోతో సత్కరించారు. కరాటే కోచ్‌లు రంజిత్, చాందినిలను పలువురు అభినందించారు.

కరాటే పోటీల్లో 'లోటస్' విద్యార్థుల ప్రతిభ

హిందూపురం : పట్టణంలోని వాల్మీకి భవన్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో రూరల్ మండలంలోని పూలకుంట వద్ద ఉన్న లోటస్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్ ప్రజీత్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్, వైస్ ప్రిన్సిపల్ జయశ్రీ, కరాటే మాస్టర్ మణికంఠరెడ్డి, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

'శ్రద్ధ' విద్యార్థుల సత్తా

మడకశిర : హిందూపురంలో జరిగిన కరాటే పోటీల్లో పట్టణంలోని ఇంటలెక్చువల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 9 బంగారు, 7 రజతం, 10 కాంస్య పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ శారద, నిర్వాహకులు రాధాకృష్ణ, హెచ్ఎం కార్తీక్‌రెడ్డి తెలిపారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ

హిందూపురం రైల్వే స్టేషన్‌లో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న రైల్వే శాఖ రాజీవ్ శర్మ, వైసిపి ఇన్‌ఛార్జి దీపిక, చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం, ధర్మవరం టౌన్

జిల్లాలోని హిందూపురం, ధర్మవరం రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులను ప్రారంభం అయ్యాయి. అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా సోమవారం నాడు ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానం ద్వారా ఈ పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా హిందూపురం రైల్వేస్టేషన్‌లో రూ.23.97 కోట్లతో స్టేషన్ ఆధునికరణ పనులను మొదలు పెట్టారు. పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని రైల్వే శాఖ డిఈఈఎన్ రాజీవ్ శర్మ, వైసిపి ఇన్‌ఛార్జి దీపిక, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని పాంచజన్య పాఠశాలకు చెందిన విద్యార్థినులు స్నేహశ్రీ, రేణుప్రియ, హిందూపురం రూరల్ మండలం ఎల్ఆర్‌జి విద్యార్థినులు అస్మా, ధారిఖలు రైల్వే విస్తరణ, అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రసంగించారు. రైల్వే శాఖ డిప్యూటీ సిఎస్‌టిఈ శ్రీనివాస్ రావు, అధికారులు సోమప్ప, ఆనంద్, సతీష్ రెడ్డి, నాగలింగ పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : అమత్భారత్ కార్యక్రమం కింద ధర్మవరం రైల్వేస్టేషన్లో ఆధునీకరణ పనులకు వర్చువల్ ద్వారా ప్రధాని నరేంద్రమోడీ సోమవారం నాడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ ఆవరణంలో ప్రత్యేక సమావేశాన్ని రైల్వే అధికారులు ఏర్పాటుచేశారు. రూ.8.64కోట్లతో ధర్మవరం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించి పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తామని రైల్వే అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతిరావు, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు అంబటిసతీశ్ కుమార్, జాతీయ అవార్డు గ్రహీత, తోలుబొమ్మలాట కళాకారుడు చిదంబరరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి గొట్లూరు చంద్ర, ధర్మవరం రైల్వేస్టేషన్ మాస్టర్ చల్లా నరసింహనాయుడు, ఆర్‌పిఎఫ్ సిఐ బోయకుమార్, జీఆర్పీ సిఐ నాగరాజు, ఎస్ఐ గోపికుమార్, వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రి సందర్శన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని విజయవాడలోని మంగళగిరికి చెందిన వైద్యులు సౌజన్య లక్ష్మి, నిరూప పటేల్ కాయకల్ప బందం సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్‌తో కలిసి ఆస్పత్రిలోని విభాగాలు, వార్డులు, ల్యాబ్‌లు, రక్తనిధి కేంద్రం, ఎక్సరే యూనిట్, డయాలసిస్ విభాగంతో పాటు తదితర వార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు. ఓపీ, ఐపీ సేవలు, అందుబాటులో ఉన్న వైద్యం, పరికరాలపై ఆరా తీసారు. రక్తనిధి కేంద్రం, రక్త పరీక్షల ల్యాబ్ తదితర వాటిలో పరికరాలను పరిశీలించి వైద్యులతో పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం, వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ రుక్మిణమ్మ, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిని పరిశీలన చేస్తున్న కాయకల్ప బృందం సభ్యులు

చంద్రబాబును కలిసిన బికె.పార్థసారథి

చంద్రబాబుతో బికె భేటీ

పెనుకొండ : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుతో సోమవారం జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి ఉండవల్లిలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా సవితమ్మను ప్రకటించిన నేపథ్యంలో బికె మద్దతుదారుల నిరసనల నేపథ్యంలో అధినేత పిలుపు మేరకు పార్థసారథి చంద్రబాబుతో సమావేశమై మంతనాలు జరిపారు.

గంగిరెడ్డిని కలిసిన మక్బుల్‌బాషా

కదిరి టౌన్ : పట్టణంలోని రాజేంద్ర ప్రసాద్ వీధిలో నివాసం ఉంటున్న రెస్కో మాజీ ఛైర్మన్ వనం గంగిరెడ్డిని సోమవారం కదిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బిఎస్ మక్బుల్‌బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. వారు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీమంత్రి షాకీర్, వైసిపి మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు సాధిక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు

బుక్కపట్నం : ఎన్నికల వేళ గ్రామీణ ప్రాంతాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్‌బాబు హెచ్చరించారు. మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో సోమవారం ఎస్ఐ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. లేనిపోని సమస్యలు సృష్టించి గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

తలుపుల పంచాయతీ కార్యదర్శిగా అబ్దుల్ మునాఫ్

తలుపుల : మేజర్ పంచాయతీ కార్యదర్శిగా సోమవారం పంచాయతీ కార్యాలయంలో అబ్దుల్ మునాఫ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన రొళ్ల మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

పుట్టపర్తి రూరల్ : 'స్పందన' ఫిర్యాదులను సత్వరమే పరిరక్షించాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్ర మంలో 27 ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదులను పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎఎస్పీ విష్ణు, డిసిఆర్‌బి శ్రీహర్ష, లీగల్ అడ్వైజర్ సాయినాథ్, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నూతన సిఐ

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. సిఐగా ఉద్యోగోన్నతి పొంది జిల్లాకు బదిలీపై వచ్చిన రాజ్‌కుమార్ ఎస్పీ ఛాంబర్‌లో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పార్వతీపరమేశ్వరుల విగ్రహాల వితరణ

ఓబుళదేవరచెరువు : పట్టణ సమీపంలోని శివాలయానికి ఇదే గ్రామానికి చెందిన బొడ్డు సాంబశివ కుమారుడు బొడ్డు నాగరాజు, భార్య బొడ్డు అరుణ సోమవారం గణపతి, పార్వతి, పరమేశ్వరుల విగ్రహాలను అందజేశారు. వారు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

నేడు 'పల్లె' ఆధ్వర్యంలో 'రా.. కదిలిరా...'

ఓబుళదేవరచెరువు : మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఓబుళదేవరచెరువులో 'రా.. కదిలిరా...' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ జయ చంద్ర తెలిపారు. ఉదయం 11 గంటలకు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నుంచి గొల్లపల్లి ఇనుగు లూరు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అలాగే విద్యుత్ కోతలను వ్యతిరేకిస్తూ పల్లె ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి ఉంటుందన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

గోరంట్ల : పట్టణంలోని హిందూపురం రోడ్డులో సోమవారం పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవితమ్మ భర్త వెంకటేశ్వర్లు టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులను కోరారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మల శిరీష్ బాలకష్ణ చౌదరి ఉత్తమ రెడ్డి భాస్కర్ రెడ్డి శ్రీధర్ సుబ్రహ్మణ్యం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతను అడ్డుకుంటాం

మడకశిర : పర్యావరణాన్ని పరిరక్షించే చెట్లను నరికితే అడ్డుకుంటామని తాలూకా గ్రీన్ భారత్ అధ్యక్షులు కామరాజ్, ఛైర్మన్ రెడ్డివారి శంకర నారాయణ హెచ్చరించారు. పట్టణంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడైనా చెట్లను విచక్షణా రహితంగా నరికితే అడ్డుకోవడంతో పాటు వారిని శిక్షించేలా న్యాయస్థానంలో పోరాటం చేస్తామన్నారు.

నేడు వైసిపి ఎస్టీ సెల్ సమావేశం

పుట్టపర్తిరూరల్ : ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ సమీ పంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వైసిపి ఎస్టీ సెల్(ఎరుకుల, బంజారా) నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పూజారి తిరుపాల్‌నాయక్ తెలిపారు. కావున జిల్లాలోని ఎస్టీ సంఘం నాయకులు, వైసిపి ఎస్టీ సెల్ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-పెనుకొండ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సోమవారం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో భవనాలు, వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలను పరిశీలించారు. రహదారి సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన వెంట పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్, అధికారులు ఉన్నారు.

పెనుకొండలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రొద్దం : మండలంలోని సానిపల్లి, కలిపి, కె.మరవపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి సమస్య తలెత్తకుండా, విద్యుత్, తాగునీరు, ఫ్యాన్లు, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎంపిడిఒ ఉన్నారు.

పరిగి : మండలంలోని పైడేటి, హొన్నంపల్లి, ధనాపురం పాఠశాల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పరిశీలించారు. పోలింగ్ బూత్ సమీపంలో ఉన్న పరిసరాలతో పాటు టాయిలెట్లు, విద్యుత్, తదితర సౌకర్యాలతో పాటు బూత్ పరిధిలోనే ఓటర్ల వివరాలను డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అని సూచించారు.

ధర్మవరం చెరువులో చేపపిల్లలు వదిలిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం చెరువులోకి 1.38 లక్షల చేప పిల్లలు వదిలామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని చెరువు మొదటి మరువ వద్ద సోమవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి చేపపిల్లలు వదిలారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ చేపపిల్లలు నాలుగైదు నెలల్లో పెద్దవి కావడం తో పాటు చేపపిల్లల ఉత్పత్తి పెరిగి చెరువు సంఘం సభ్యులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. చెరువు లో చేపపిల్లలు వదలడం పట్ల చెరువు సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ మత్స్యశాఖ పర్యవేక్షకులు జ్యోతి, అసిస్టెంట్ హెప్సిబా, ధర్మవరం మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు రాజప్ప, ఉపాధ్యక్షుడు

చెరువులో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

లక్ష్మీనారాయణ, సహాయ కుడు బోయ శివ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు, వైసిపి నాయ కులు తొండమల రవి, బోయ నరసింహులు, వడ్డే శ్రీనివాసులు, రంగుల నారాయణ, కొడవండ్లపల్లి నారాయణస్వామి, బోయ రాజా, ఖలీల్ పాల్గొన్నారు.

అభివృద్ధే టిడిపి-జనసేన ధ్యేయం

ప్రజాశక్తి-పెనుకొండ

టిడిపి, జనసేన పార్టీలు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తాయని టిడిపి, జనసేన ఉమ్మడి పెను కొండ అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. ఆమె సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఒక వలస పక్షి వచ్చి దోచుకొని ఎమ్మెల్యేగా ఐదేళ్ల పూర్తి కాకనే వెళ్లి పోయిందన్నారు. ఇప్పుడు వచ్చిన మరో వలస పక్షి కళ్యాణదుర్గంలో సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలపైనే కేసులు పెట్టించి వారి ఆస్తులను సైతం దోచుకుందని విమర్శించారు. వ్యక్తులను మారిస్తే ఓట్లు పాడుతాయనుకోవడం సిఎం జగన్ భ్రమ అన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి

అభివాదం తెలుపుతున్న సవితమ్మ, నాయకులు

వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కుమార్, మండల కన్వీనర్లు మహేష్, గంగాధర్, టిడిపి నాయకులు మాధవనాయుడు, వెంకటరమణ, సూర్యనారాయణ, డివి.ఆంజనేయులు, టైలర్ ఆంజనేయులు, శ్రీరాములు, నరసింహు లు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సిఎం జగన్

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ దేశంలోనే సంక్షేమ సారథిగా నిలిచిన సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి కోరారు. 'ఆత్మీయ పలకరింపు'లో భాగంగా సోమవారం ఆయన స్థానిక వైసిపి శ్రేణులతో కలిసి గోరంట్ల పంచాయతీలోని సిరగంవాండ్ల పల్లి, శివాలయం కాలనీ, రామశంకరయ్య కాలనీ, వినాయక నగర్‌లలో ఆయన ఇంటింటికీ వెళ్లి అభి వృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ముందుగా వైసిపి నాయకులు శివారెడ్డి, వెంకటశివ, రామకృష్ణారెడ్డి, జయచంద్ర రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కార్యకర్తలు చరణ్‌రెడ్డికి గజమాల వేసి పూలు చల్లుతూ టపాసులు పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచి

చరణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు

నాగేనాయక్, ఉప సర్పంచి రాజారెడ్డి, జీనవాండ్లపల్లి సాయికృష్ణ, సురేష్‌రెడ్డి, ఉప సర్పంచి రాజారెడ్డి, నార్సింపల్లి శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, ధనారెడ్డి, పాటూరి లక్ష్మిరెడ్డి, సమరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులు, శ్రీరాములు, నాగరాజు, రెడ్డివారి రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఖాద్రీశుని ఆలయ అర్చకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఉప ప్రధాన అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న కుమార రాజాచార్యులు డాక్టరేట్ పొందారు. ఈ నెల 17వ తేదీ కోల్‌కత్తాలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ హెరిటేజ్ యూనివర్సిటీ 45వ వార్షిక ఇంటర్నేషనల్ సెమినార్‌లో కుమార రాజాచార్యులు కి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందజేశారు. ధర్మశాస్త్రాల్లో విశేష ప్రతిభ కలిగి, 25 ఏళ్లుగా ఖాద్రి లక్ష్మీనరసింహస్వామికి నిత్య కైంకార్యాలు, ధర్మ ప్రచారానికి ఆయన విశేష కృషి చేశారు. రాజాచార్యులు మాట్లాడుతూ ఇకపై తన సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. నరసింహస్వామి ఆశీర్వాదం వల్లే ఇంత గొప్ప అవకాశం లభించిందన్నారు. తల్లిదండ్రులు నేర్పిన సంస్కారం ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందన్నారు.

డాక్టరేట్ అందుకుంటున్న కుమార రాజాచార్యులు

రైతులకు 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మద్దతుదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మార్కెట్ వీధిలోని ట్రాన్స్‌కో కార్యాలయం వెళ్లి అధికారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ గత ఎన్నికల ముందు వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక 5 గంటలు మాత్రమే ఇస్తున్నారని, దీంతో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని మండిపడ్డారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంబటి సతీష్‌కుమార్, డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, జి.పుల్లయ్య, తుంపర్తి పరమేశ్, గొట్లూరు చంద్ర, నారాయణస్వామియాదవ్, దుస్సా క్రిష్ణ, చిలకం సూర్యనారాయణరెడ్డి, బోడగల గిరిధర్, నబి రసూల్, మార్కెట్ రహీం, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'స్పందన'కి ఆ ముగ్గురే హాజరు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపిడిఒ, ఇఒఆర్‌డి, వ్యవసాయ అధికారి మినహా కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. మిగిలిన శాఖల అధికారులు అలా వచ్చి ఇలా వెళ్లడం గమనార్హం. చాలా మంది అధికారులు ప్రతివారం 'స్పందన'కు హాజరవడం రిజిస్టర్‌లో సంతకం చేయడం ఇంటికెళ్లడం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో అధికారులు లేకపోవడంతో అర్జీదారులు తమ సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక నిరాశగా వెనుది రుగుతున్నారు. అధికారులు లేని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడమెందుకని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పింఛను మంజూరు చేయండి సారూ..

మండలంలోని గోకనపల్లి పంచాయతీకి చెందిన కత్తులూరి రమణయ్య మూడేళ్లుగా పక్షవాతం తో మంచానపడ్డారని సామాజిక పింఛను మంజూరు చేయాలని అతడి భార్య రమణమ్మ కోరుతుంది. ఇప్పటికే గోకనపల్లి గ్రామ సచివాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం లేదని వాపోయింది. ఈ రోజు 'స్పందన'లో అర్జీ ఇచ్చానని, అధికారులు స్పందించి పింఛను మంజూరు చేయాలని కోరుతోంది.

పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్న సామకోటి

'సామకోటి' ఆధ్వర్యంలో 'నా మొదటి ఓటు చంద్రబాబుకే'

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సోమవారం టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో 'నా మొదటి ఓటు చంద్రబాబుకే' కార్యక్రమం ద్వారా యువతకు ఓటుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో మీ మొదటి ఓటు ఎంతో విలువైందన్నారు. యువత భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, చెన్నప్ప, హరిప్రసాద్, అంజినాయుడు, వెంకట్రాముడు, రామాంజనేయులు, నరసింహులు, కిష్టప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా రవిసాగర్

బుక్కపట్నం : ప్రభుత్వ జిల్లా విద్య శిక్షణ సంస్థ కళాశాల ప్రిన్సిపల్‌గా సోమవారం రవిసాగర్ బాధ్యతలు చేపట్టారు. ఈయన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శిక్షణ విద్యాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఏలూరు జిల్లా ఉప విద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై బుక్కపట్నం జిల్లా శిక్షణ కళాశాల ప్రిన్సిపల్‌గా వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు క్రమశిక్షణ, మెలకువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో బుక్కపట్నం కళాశాలకు వన్నె తెచ్చేలా ప్రయత్నిస్తానని తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

చిలమత్తూరు : వికలాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ప్రభుత్వ వైద్యాధికారి రామకృష్ణ సూచించారు. కొడికొండ చెక్‌పోస్ట్‌లోని సమర్థనం ట్రస్ట్‌లో శిక్షణ పొందుతున్న వికలాంగ విద్యార్థులకు సోమవారం వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యసాధన దిశగా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే విజయం వరిస్తుందన్నారు. మహనీయులను స్ఫూర్తిగా తీసు కుని, పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, ట్రైనర్ నరసింహులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

లేపాక్షి : మండలంలోని బిసల మానేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్టాపనకు అదే గ్రామానికి చెందిన అంగడి ప్రకాష్ సోమవారం రూ. 1.45 లక్షలు అందజేశారు. అంగడి ప్రకాష్ ప్రస్తుతం బెంగళూరులో స్థిరపడ్డాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఈతచెట్ల తొలగింపుపై ఫిర్యాదు

పుట్టపర్తి క్రైమ్ : ప్రభుత్వ కుంట భూమిలో ఉన్న ఈత, వేపచెట్లను తొలగించడంతో 30 కుటుంబాలు జీవనాధారం కోల్పోయాయని రొద్దం మండలంలోని ఆర్.లోచర్ల గ్రామ కల్లుగీత కార్మికులు సోమవారం 'స్పందన'లో కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. తెలుగునాడు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నీళ్ల రమణగౌడ్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆర్.లోచర్ల, కంచిసముద్రం గ్రామాల్లోని గీత కార్మికులు, పశుపోషకులు వాటిపై ఆధార పడి జీవనోపాధి పొందేవారన్నారు. చెట్ల తొలగింపుపై ఆ మండలంలోని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. కార్యక్రమంలో సాయినాథగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హరినాథ్‌గౌడ్, అంజనప్పగౌడ్, హనుమంతప్పగౌడ్, ఆటో గోపాల్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

సమ్మె బాటలో 'ఉపాధి' సిబ్బంది

పుట్టపర్తి అర్బన్ : సమస్యలు పరిష్కరించాలని లేనిచో సమ్మెబాట పడతామని ఉపాధి హామీ సిబ్బంది సోమ వారం 'స్పందన'లో రాష్ట్ర జెఎసి ఆధ్వర్యంలో కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. జెఎసి ఛైర్మన్ వెంకటరమణ, నాయకులు సాయిరాం మాట్లాడు తూ 18 ఏళ్లుగా ఉపాధి హామీలో పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగోన్నతులు కల్పించకపోవడంతో తమకు అన్యాయం జరుగుతోందన్నారు. మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్తామన్నారు.

'చంద్రహాస్' హాస్పిటల్ ప్రారంభం

కదిరి టౌన్ : పేదలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో పట్టణంలో చంద్ర హాస్ హాస్పిటల్‌ను ప్రారంభించామని వైద్యురాలు దివ్యచంద్ర తెలిపారు. పట్టణంలోని రాయచోటి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చంద్రహాస్ హాస్పిటల్‌ను సోమవారం అట్టహాసంగా ప్రారంభించా రు. డాక్టర్ దివ్యచంద్ర మాట్లాడుతూ కర్నాటకలోని చిక్కబల్లాపూర్‌లో ప్రభుత్వ వైద్యురాలిగా పని చేస్తున్న తాను ఇక్కడి పేదప్రజల కోసం హాస్పిటల్ ఏర్పాటు చేశామన్నారు. అన్నిరకాల వ్యాధులకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ బత్తల వెంకటరమణ, హరిప్రసాద్, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, వైసిపి సమన్వయకర్త మక్బుల్, వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవనకుమార్ రెడ్డి, డాక్టర్ మదన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన చంద్రహాస్ ఆసుపత్రి

డాక్టర్ దివ్యచంద్ర

పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేయొద్దు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఏడవ విడత భూ పంపిణీలో భాగంగా సోమందేపల్లి, గుడిపల్లి గ్రామాల పొలాలను భూమి లేని దళిత, బడుగు, బలహీన వర్గాలు, నిరుపేదలకు మంజూరు చేశారని, వాటికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు రద్దు కాకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆర్‌టిఐ కార్యకర్త నడింపల్లి బాబుప్రసాద్ లోకాయుక్త కర్నూలు కోర్టులో కేసు వేయ డంతో 142 మంది ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున పేదల అసైన్మెంట్ పట్టాదారు పాసు పుస్తకాలు రద్దు చేయకుండా పేదలకు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ దీనిపై ఉన్నతాధికారులకు నివేదించి పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న, మండల కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, మాదిగ దండోరా జిల్లా నాయకులు సూర్యనారాయణ, కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు రామకృష్ణ, నిరుపేదలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ సమస్యలపై రైతుల నిరసన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని 8 గ్రామాల రైతులు సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలోని ఎఇ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మద్దతుదారులు మాట్లాడుతూ లో వోల్టేజ్ కారణంగా మోటార్లు మరమ్మతులకు గురై ప్రతిసారి రూ. 10వేల చొప్పున ఖర్చు వస్తుందన్నారు. రోజుకు 3 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా రావడంతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఇకనుంచైనా 9 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని, లేనిచో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎడి సుబ్రహ్మణ్యంకి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో గంగిరెడ్డిపల్లి, పొడరాళ్లపల్లి, గుడ్డంపల్లితండా, కమ్మవారిపల్లి, గుంజేపల్లి, మల్లేపల్లి, సిరిగారిపల్లి, గుట్టకిందపల్లి రైతులు కంఠగాని నారాయణస్వామి, దేవేందర్‌నాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బాలభాస్కర్, జయకృష్ణ, వాటర్ రవి, మల్లయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఎడి సుబ్రహ్మణ్యంకి వినతి పత్రం ఇస్తున్న రైతులు

ధర్మవరం టిడిపి అభ్యర్థి నేనే : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ధర్మవరంలో టిడిపి తరపున పోటీ చేసేది నేనే ఎలాంటి అపోహలు నమ్మవద్దని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. నాడు శ్రీరామచంద్రుడు అశ్వమేధ యజ్ఞానికి వాల్మీకి అండగా ఉన్నారు.. నేడు శ్రీరామ్ యజ్ఞానికి వాల్మీకులు అండగా ఉన్నారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే రాయలసీమ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్నారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో పరిటాల శ్రీరామ్ పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేస్తామన్నారు. అంతకుముందు పట్టణంలో వాల్మీకులు భారీ ప్రదర్శన నిర్వహించి, పరిటాల శ్రీరామ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

వాల్మీకుల ర్యాలీలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

ఇంటర్ విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

ఫీజతో సంబంధం లేకుండా ఇంటర్ విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలను డిమాండ్ చేశారు. పట్టణంలోని బిసి కళాశాల వసతి గృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడా రు. పలు కళాశాలల యాజమాన్యలు ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించడం సరికాదన్నారు. ఫీజుల కోసం వేధించే కళాశాలలపై విద్యాశాఖ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని, లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయా కళాశాలలపై ప్రత్యక్ష దాడులకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, భగత్, మహేష్, పవన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

చేనేత కార్మిక పింఛనులో కొత్త నిబంధనలు రద్దు చేయాలి

ధర్మవరం టౌన్ : చేనేత కార్మికుల పింఛన్ల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నూతన నిబంధనలను వెంటనే రద్దు చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు సంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ సోమవారం ఆర్డీఓ వెంకట శివారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొత్త నిబంధనను రద్దు చేసి 45 ఏళ్లకే పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఆర్‌డిఒ ఈ విషయాన్ని ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. వినతి ఇచ్చిన వారిలో చేనేత నాయకులు ఆదినారాయణ, బాబు, శ్రీధర్, శ్రీనివాసులు, గంగాధర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

వాలంటీర్లకు సన్మానం

బత్తలపల్లి : ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా వాలంటీర్లు నిలిచారని సర్పంచి చల్లా కరుణాకర్‌నాయుడు కొనియాడారు. 'వాలంటీర్లకు వందనం'లో భాగంగా సోమవారం మండలంలోని దంపెట్ల గ్రామ సచివాలయ ఆవరణలో పంచాయతీ పరిధిలోని వాలంటీర్లను సన్మానించారు. వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, సర్పంచి కరుణాకర్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో వాలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు.

'మరోసారి వైసిపిని గెలిపిద్దాం'

ప్రజాశక్తి-మడకశిర

రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించి మరోసారి జగన్‌ను సిఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. మండలంలోని పి.బ్యాడిగెర, హుల్లేకెర, దేవరపల్లి గ్రామాల్లో సోమవారం మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప, హిందూపురం ఎంపి అభ్యర్థి శాంతమ్మ ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నవరత్నాలుతో పాటు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, ఎంపీటీసీ జయమ్మ, నాయకులు నసీర్, వైసిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కందికుంట సమక్షంలో పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కదిరి టౌన్

తలుపుల మండలంలోని ఈదులకుంట్లపల్లి పంచాయతీ చంద్రనాయక్‌తండాకు చెందిన 30 కుటుంబాలు సోమవారం పట్టణంలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట నివాసంలో కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టిడిపిలో చేరారు. కందికుంట మాట్లాడుతూ వైసిపి పాలనతో విసిగిపోయిన ప్రజలు సిఎం జగన్‌కు ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చేరిన వారిలో ప్రసాద్ నాయక్, గోపాల్‌నాయక్, రమేష్‌నాయక్, భాస్కర్‌నాయక్, అశోక్‌నాయక్, రాజునాయక్, శంకర్‌నాయక్, సురేంద్రనాయక్, శ్రీనివాసులునాయక్, దేవళ్లనాయక్, చంద్రనాయక్, జివ్లానాయక్, అప్పనాయక్, మహేష్ నాయక్, ప్రకాష్‌నాయక్, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో శంకర, రామకృష్ణారెడ్డి, దేవేంద్రనాయక్, నారాయణ రెడ్డి, ఓబుళనాయుడు, సూర్యశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీశైలం రమణ పాల్గొన్నారు.

కందికుంట యశోదదేవి విస్తృత ప్రచారం

17వ వార్డులో పర్యటిస్తున్న కందికుంట యశోదదేవి

వచ్చే ఎన్నికల్లో టిడిపి తరపున కందికుంట వెంకటప్రసాద్‌ను గెలిపించాలని కందికుంట యశోదదేవి ప్రజలను కోరారు. పట్టణంలోని 17వ వార్డులో సోమవారం కౌన్సిలర్ నాయపు సావిత్రమ్మ ఆధ్వర్యంలో ఆమె ఇంటింటా ప్రచార కార్యక్రమం చేపట్టారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టోలోని పథకాలను అమలు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయ కురాలు పర్వీన్ భాను, నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మలగూరులో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండలంలోని మలగూరు గ్రామంలో సోమవారం సర్పంచి రమేష్ ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వైసిపి నాయకులు వేణురెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. వేణురెడ్డి మాట్లాడుతూ పురం ప్రజలు 40 ఏళ్లుగా టిడిపిని ఆదరిస్తున్నా, బాలకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గాన్ని కనీస స్థాయిలో కూడా అభివృద్ధి చేయలేదన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో వైసిపికి అండగా నిలిచి పురంలో మార్పునకు నాంది పలకాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తులసి, మండల కన్వీనర్ రాము, నాయకులు గిరి, భానుప్రకాష్‌రెడ్డి, చలపతి, వైస్ సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, శ్యామలమ్మ, మంజుల, అంగజాల శేఖర్, ఏకాశప్ప, మిల్లు నరసింహప్ప, శ్రీనాథ్, బాలాజీ, రామంజి, మోహన్, రాము, రమేష్, వెంకటేష్, గంగప్ప, అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.